www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 20 మే 2025
5
అన్నమయ్య

'మిట్స్' అధ్యాపకురాలు గాయత్రికి డాక్టరేట్

ప్రజాశక్తి-మదనపల్లె

మిట్స్‌లో కంప్యూటర్ శాస్త్రం, ఇంజనీరింగ్ విభాగంలో సహాయ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఉలవనేని గాయత్రికి డాక్టరేట్ పట్టా లభించింది. తమిళనాడు రాష్ట్రంలోని వేలూరు లో ఉన్న వెల్లూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయం (వెల్‌టెక్‌లోని) కంప్యూటర్ శాస్త్రం, సమాచార వ్యవస్థ విభాగంలో గాయత్రి పరిశోధన చేశారు. ఆమె చేసిన పరిశోధన "జీవ పదార్థాల క్షేత్రంతో కూడిన పద్ధతులు, లోతైన అభ్యాస నమూనాలను ఉపయోగించి చర్మ క్యాన్సర్ గుర్తింపు వ్యవస్థ రూపకల్పన, అభివృద్ధి" అనే అంశంపై సాగింది. ఈ పరిశోధనను అక్కడే పనిచేస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.ఎల్.ఆర్తి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మిట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ ఈ విషయాన్ని ప్రకటించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, కార్యనిర్వాహక సంచాలకులు కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ శ్రీదేవి తదితరులు గాయత్రిని అభినందించారు. గాయత్రి సాధించిన ఈ ఘనత మిట్స్ కళాశాల ప్రతిష్ఠను మరింత పెంపొందించినదిగా పేర్కొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-చిన్నమండెం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు విశేష కృషి చేస్తామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పేదలకు సంక్షేమ పథకాలు అందక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని వారిని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిజమైన పేదలను గుర్తించి వారందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. త్వరలో అర్హులకు నూతన పెన్షన్లు, ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను పేదలందరూ సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. జిల్లాలోని అధికారులందరూ బాధితుల సమస్యలను సీరియస్‌గా తీసుకుని వాటి పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. వర్షం వస్తున్నప్పటికీ అర్జీదారులు పెద్దఎత్తున తరలివచ్చి ప్రజాదర్బార్ కార్యక్రమానికి వచ్చి మంత్రికి అర్జీలు సమర్పించారు. అనంతరం మంత్రి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ అర్జీలు స్వీకరించి సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. బాధితులు మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రాయచోటి :మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాయచోటి పట్టణంలోని తమ కార్యాలయంలో ఉదయం వర్షంలో తడుస్తూ ప్రజల సమస్యలు వింటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ తున్నారు. మంత్రి విజయవాడకు వెళుతూ క్యాంపు కార్యాలయానికి చేరుకోగానే అర్జీదారులు తమ సమస్యల పరిష్కారం కోసం పలు సమస్యలపై వినతి పత్రాలను సమర్పించారు. వర్షం వస్తున్నప్పటికీ మంత్రి ఏమాత్రం విసిగించుకోకుండా బాధితుల సమస్యలను ఓపికగా, సహనంతో వింటూ వారి సమస్యలను పరిష్కరించారు.

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సమస్యల పట్ల నిర్లక్ష్య ధోరణి వీడాలి : కలెక్టర్

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్య ధోరణి వీడి వాటిని బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారం పై నేరుగా పర్యవేక్షణ చేయడం జరుగుతోందన్నారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్లో ఉన్న బియాండ్ ఎస్ఎల్‌ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అర్జీదారులకు స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కలెక్టర్ శ్రీధర్ చామకూరి కల్పించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదనరావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఎస్‌డిసి రాఘవేంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్ కుమార్‌రెడ్డి

మహానాడుతో మారనున్న 'సీమ' రూపురేఖలు

ప్రజాశక్తి-పీలేరు

మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్.టి.రామారావు జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా జరిగే మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం పీలేరు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ టిడిపి శ్రేణులతో మినీ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొదటిసారి కడప గడ్డపై నిర్వహిస్తున్న మహానాడుతో రాయలసీమలో నూతనోత్సాహాన్ని నింపుతుందని, చరిత్రలో నిలిచిపోయేలా పసుపు పండగ జరగనుందన్నారు. రాయలసీమను పీడిస్తున్న నిరుద్యోగ భూతాన్ని సమూలంగా అంతం చేసి, రాయలసీమలో హార్టికల్చర్, పరిశ్రమలు, డెయిరీలు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటామన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయని జగన్మోహన్ రెడ్డి బెదిరింపులతో ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్లాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్ర బాబు నాయుడుపై ఉన్న నమ్మకంతో పరిశ్రమలు మళ్ళీ నెలకొల్పడం జరిగిందని పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని ఆయన అన్నారు. వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో చేయని అభివృద్ధి కూటమి ప్రభుత్వం 11 నెలల్లో చేసి చూపించిందని తెలియజేశారు. ఈ నెల 27, 28, 29వ తేదీల్లో మూడు రోజులపాటు కడప వేదికగా జరిగే మహానాడుతో రాయలసీమ రూపరేఖలు మారనున్నాయని, పసుపు సైనికుల అంబరాన్నిఅంటే సంబరాల కార్యక్రమానికి నియోజవర్గంలోని 6 మండలాల పరిధి నుంచి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలు, నల్లారి అభిమానులు తరలివచ్చి కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి టిడిపి శ్రేణులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలు, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

మదనపల్లె: ఈ నెల 22న నియోజకవర్గ మినీ మహానాడును జయప్రదం చేయాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 27నుండి కడప లో జరగబోయే మహానాడు కార్యక్రమానికి నియోజకవర్గంలోని టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయ వంతం చెయాలని కోరారు. ముందస్తుగా మదనపల్లిలో మినీ మహానాడును ఈ నెల 22న తన నివాసం వద్ద ప్రజా వేదికలో నిర్వహించడం జరుగుతుందని ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమానికి నాయకులు కార్యకర్తలు బూత్ కమిటీ సభ్యులు పాల్గొని మినీ మహానాడు జయప్రదం చేసేందుకు కృషి చేద్దామని తెలిపారు. 22 హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని చెప్పారు. సమావేశంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదేళ్ల విద్యాసాగర్, రాజంపేట అధికార ప్రతినిధి ఆర్జే.వెంకటేష్, నవీన్ చౌదరి, టిడిపి నాయకులు జంగాల వెంకటరమణ, రాటకొండ మధు బాబు, సద్దలచంద్రాయుడు, సుధాకర్, మాజీ కౌన్సిలర్లు బాబూ నాయుడు, రాధా, కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి-రాయచోటి

జూన్ 5వ తేదీన రాష్ట్ర మూడవ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ లక్ష్మీప్రసాద్, రాయచోటి తాలూకా అధ్యక్షులు ఒ.సాయి కుమార్ పేర్కొన్నారు. సోమవారం రాయచోటి తాలూకా కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేపు రాష్ట్ర 3వ కౌన్సిల్ సమావేశనాకి పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధ్యాయ,కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగలు పెద్ద ఎత్తున హాజరై సభను జయప్రదం చేయాలిని తెలిపారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో తాలూకా కార్యదర్శి, సుజిత్ డాల్, తాలూకా కోశాధికారి సురేష్, తాలూకా ఉపాధ్యక్షులు సంయుక్త కార్యదర్శి వలి, రఘు, సభ్యులు శివ నాయక్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

దౌర్జన్యకారులపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-రాయచోటి : రూ.మూడున్నర కోట్ల పైగా పలువురి దగ్గర అప్పులు తీసుకొని అప్పిచ్చిన వారిపైనే దౌర్జన్యానికి పాల్పడుతూ బెదిరింపులకు గురి చేస్తున్న గ్యాంగ్‌పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలంటూ మదనపల్లికి చెందిన సుమారు 30 మందికి పైగా బాధితులు ఎస్పి విద్యాసాగర్ నాయుడుకు తమ గోడును విన్నవించారు. సోమవారం ఎస్పికి ఫిర్యాదు చేసిన అనంతరం బాధితులు విలేకరులతో మాట్లాడుతూ జిల్లా పరిధిలోని మదనపల్లి పట్టణానికి చెందిన రమేష్ భార్య కందుల సుజాత, ఆమె కుమారుడు కందుల సునీల్, నరేంద్ర భార్య సుంకర లావణ్య, పద్మప్రియ, గౌరీ, నాగరత్న, నలిని, నాగమణి పట్టణంలో ఉండే ఒంటరి మహిళలను, ఫ్యామిలీలను, వృద్ధులను సుజాత టార్గెట్ చేస్తూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని మూడున్నర కోట్ల వరకు అప్పు తీసుకొందన్నారు. అప్పు ఇచ్చినవారు డబ్బులు అడిగితే సుజాత పైన కనబరిచిన గ్యాంగ్‌తో వెళ్లి వారి ఇంటి వద్దకు వెళ్లి వారిని నానా రకాలుగా దూషించడంతో పాటు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు.

నిస్వార్థ ప్రజా నాయకుడు 'పుచ్చలపల్లి'

- సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సుందరయ్య జీవితం పేద ప్రజలకు అంకితమని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు అన్నారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణభారత కమ్యూనిస్టు నిర్మాత, తన యావదాస్తిని పేదప్రజల సంక్షేమం కోసం అర్పించి, పిల్లలు పుడితే ఎక్కడ స్వార్థం పెరిగి ఉద్యమానికి సరైన న్యాయం జరగదని తలచి సహచరి లీలమ్మతో కలిసి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్న త్యాగ మూర్తులు సుందరయ్య అని కొనియాడారు. కులవివక్ష ఉండరాదని తన ఇంటిలోనే సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసి, తనపేరులో నున్న కులాన్ని సూచించే పదాన్ని పక్కన పెట్టి సుందరయ్యగా మారాడని అభివరి?ంచాడు. వ్యవసాయ కూలీల శ్రమ దోపిడీ నుండి బయట వేయడానికి వ్యవసాయ కూలి సంఘాన్ని నిర్మాణం చేసి పోరాడారని గుర్తు చేశారు. భూస్వాములు కూలీలకిచ్చే ధాన్యం కొలతల్లో మోసాన్ని ఎండగట్టాడని, తుదకంటా పేదప్రజల పక్షాన నిలిచిన యోధుడు సుందరయ్య అని కితాబిచ్చారు. పార్లమెంటుకు సైకిల్ పై వెళ్లడం, ప్రజా సమస్యల్ని ప్రభావవంతంగా చట్టసభల్లో వినిపించడం చూస్తే ప్రజలపట్ల ఎంత భాద్యతగా పనిచేయాలో అర్థమవుతుందని తెలిపారు. నేడు అసెంబ్లీ, పార్లమెంటులో జరిగే చర్చలు చూస్తుంటే నువ్వు దొంగ అంటే నువ్వు దొంగ అనుకోవడం తప్ప ప్రజల సమస్యలు చర్చే జరగదని, నేటి ప్రజాప్రతినిధులందరూ చట్టసభల్లో ఆనాటి సుందరయ్య లాంటి వారి ఉపన్యాసాలను వినాలని సూచించారు. సుందరయ్య భౌతికంగా దూరమై 40 ఏళ్లయినా వారి స్ఫూర్తి ఎప్పటికీ మనతోనే ఉంటుందని, వారి ఆశయాలకు అంకితమై పనిచేయడమే వారికి మనమిచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహ, అశోక్, ప్రసన్న, రమణ పాల్గొన్నారు.

మదనపల్లి: సుందరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

రాయచోటి : సోషలిస్ట్ స్థాపనకు సిపిఎం వ్యవస్థాపించిన పుచ్చలపల్లి సుందరయ్య ప్రజల మనిషి అని ఆయన వర్ధంతి వేడుక ప్రభుత్వాసుపత్రిలో ఘనంగా నిర్వహించి ప్రజా సేవలో ప్రజాపోరాటాలల్లో ఆయన బాటలో నడవాలని 100 మంది రోగులకు దాతల సహకారంతో ప్రముఖ వైద్యులు మహేశ్వరరాజు, కిరణ్‌లతో కలసి బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేసినట్లు సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు తెలిపారు. అనంతరం అయన విలేకరులతో మాట్లాడుతూ పెద్ద భోస్వాముల కుటుంబంలో పుట్టిన పేద బడుగు బలహీన వర్గాల కోసం చివిరిదాకా కమ్యూనిస్టు ఉద్యమమే ప్రధానమని నమ్మిన సిద్ధాంతం కొరకు భూములు తృణపాయంగా పేదలకు పంచాడని, సొంత ఆస్తిపై వ్యామోహం లేదనుకునేలా పిల్లలు లేకుండా కుటుంబ నియంత్రణ పాటించడం నిదర్శనం పేర్కొన్నారు. స్వతంత్ర పోరాటంలో తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల నిర్బద కాలంలో కూడా ఆయన పార్టీ మనుగడకు చేసిన కృషి ఆదర్శనీయమని తెలిపారు. రైతు ఉద్యమాన్ని ఉదృతం చేశాడని తెలిపారు. పార్లమెంట్‌కు సైతం ప్రజాధనం వృధా చేయకుండా సైకిల్ మీద వెళ్లి కమ్యూనిస్టుల విలువలు పెంచిన నిరాడంబరుడు తెలిపారు. పార్లమెంట్‌లో సామాజిక న్యాయం అంటే ప్రతి ఒక్కరూ తినడానికి తిండి ఉండడానికి ఇల్లు కట్టుకోవడానికి బట్ట ఉండాలని తెలుగులో పార్లమెంట్ తొలి ప్రతి పక్షనేతగా అందరి మన్నలు పొందిన సుందరయ్య జీవితం ఆదర్శనంగా తీసుకుని సోషలిస్ట్ సాధనకు అందరం పోరాడాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగబసిరెడ్డి, రామచంద్ర, సిఐటియు నాయకులు రమణ, సుబ్రహ్మణ్యం, రాజు, బి.వి.రమణ, లోహిత్, గీత, రమేష్, ప్రభుత్వాసుపత్రి సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయచోటి : ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు ఇస్తున్న సిపిఎం నాయకులు

'మార్పు కోసం విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలి'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సమాజంలో అసమానతలు పోవాలంటే సోషలిజం సమాజం రావాలని ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు ఎస్.వెంకటరావు అన్నారు. ఎస్ఐఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక విశ్వం విద్యాసంస్థల వద్ద నిర్వహిస్తున్న రాష్ట్ర శిక్షణ తరగతుల క్లాసులకు మూడో రోజు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ సమాజంలో ఆకలి కేకలు పోవాలన్నా, పేదరికం నిర్మూలన కావాలన్నా సోషలిజమే పరిష్కార మార్గమన్నారు. ఈ సమాజంలో మార్పు కోసం విద్యార్థులందరూ పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ప్రస్తుత సమాజం నుండి అసమానతలు పోవటానికి విద్యార్థులు చైతన్య వంతులై మంచి సమాజం కోసం పోరాటం చేయాలన్నారు. ఈ పెట్టుబడి దారి సమాజంలో నిరుద్యోగం పెరిగి దేశంలో యువత ఇతర దేశాలకు వలసలు పోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల్లో సంవత్సరానికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామని హామీలు గుప్పించి, అధికారం చేపట్టాక ఆ విషయాన్ని మర్చిపోయారన్నారు. దేశంలో ప్రతీరోజు అర గంటకొక మహిళ పైన దాడి జరుగుతోందన్నారు. విద్యా సంస్థల్లో చదువులకు బదులుగా ఆత్మహత్యలు పరిపాటిగా మారుతున్నాయన్నారు. సమాజంలో మార్పు వస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని, కావున ఎస్ఎఫ్ఐ లక్ష్యం సోషలిజమేనన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.ప్రసన్నకుమార్, ఎ.అశోక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.నరసింహ, డి.రమణ, వివిధ జిల్లాల నుండి విచ్చేసిన విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఎస్.వెంకటరావు

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వర్షపు నీటితో పట్టణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గత కొన్ని సంవత్సరాల నుండి మురుగునీటి కాలువలో ప్రవహిస్తున్న నీటిని సరిగ్గా పట్టించుకోకుండా పట్టణంలోని హోటల్ నిర్వాహకులు వెనుక భాగంలో శుభ్రం చేయకపోవడంతో కాలువలు స్తంభించిపోయాయి. మురుగునీరు బెంగళూరు బస్టాండ్ రోడ్డుపైకి చేరాయి. ఆదివారం సెలవు కావడంతో కార్మికులు రాలేదు. సోమవారం ఉదయం ఎమ్మెల్యే షాజహాన్ బాషా, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల కార్మికులతో సత్వర చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ వర్షాలు ఎక్కువగా కురిసినప్పుడు మురుగునీటి కాలువల్లో చెత్త పేరుకుపోయినప్పుడు వర్షపు నీరు, మురుగునీరు రోడ్లపైకి వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు బాగా ఇబ్బంది పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు చెత్తను కాలువల్లో పడేయకుండా మున్సిపాలిటీ వారు ఏర్పాటు చేసిన చెత్తకుండీల్లోనే వేయాలని సూచించారు. ఈ సమస్యకు శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు సైతం వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు షంషీర్, షేక్ సైదు, మున్సిపల్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మురుగునీటి కాలువలపై చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే, కమిషనర్

కలెక్టర్ చొరవతో దారి సమస్యకు పరిష్కారం

కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న కలికిరి మండలం కూరపల్లి గ్రామస్తులు

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల సమస్యలను అవగాహన చేసుకుని సమస్య మూలాలలోకి వెళ్లి వాటిని పరిష్కరించడానికి బాధ్యతగా కృషి చేసిన అధికారుల పట్ల కృతజ్ఞతతో పాటు ప్రభుత్వం పట్ల కూడా ప్రజలలో ఒక భరోసా, విశ్వాసం ఏర్పడుతుంది. ఇందుకు నిదర్శనంగా కలెక్టర్ శ్రీధర్ చామకూరి చూపిన చొరవతో గ్రామంలో సంవత్సరాలుగా నెలకొన్న దారి సమస్యకు పరిష్కారం లభించినందుకు గ్రామస్తులందరూ తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... కలికిరి మండలం పారపట్ల గ్రామం కూరపల్లిలో 100 ఎకరాలకు తరతరాలుగా వెళ్లే పొలం దారిని గత రెండేళ్ల క్రితం కొద్దిమంది మూసేశారు. అప్పటినుంచి పొలానికి దారి విషయమై గ్రామంలోని కొన్ని విభేదాల కారణంగా సమస్య క్లిష్టమై పరిష్కారం కాకుండా ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజల సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమంలో గ్రామస్తులు అర్జీ సమర్పించారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కూడా దారి పరిష్కారానికి క ృషి చేయాలని అధికారులను అభ్యర్థించారు. రెవిన్యూ సదస్సుల పర్యవేక్షణలో భాగంగా గత డిసెంబర్లో కలికిరి మండలాన్ని కలెక్టరు సందర్శించిన సమయంలో గ్రామస్తులు తమ సమస్యను ఆయనకు విన్నవించారు. సమస్య తన దృష్టికి వచ్చిన వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడం జరిగింది. రైతులు, గ్రామస్తులతో మాట్లాడి ఎవరికీ ఇబ్బంది లేకుండా సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని తాసిల్దారును కలెక్టర్ ఆదేశించారు. దీనిపై సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు ఆరా తీశారు. ఈ మేరకు తహశీల్దార్ గ్రామంలో అందరినీ సమావేశపరిచి సమస్యను అర్థమయ్యేలా వివరించి అందరికీ ఆమోదయోద్యంగా దారిని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. సమస్య పరిష్కారానికి అత్యంత చొరవ చూపిన కలెక్టర్‌ను సోమవారం రాయచోటి కలెక్టరేట్లో జరిగిన పీజిఆర్ఎస్ కార్యక్రమంలో సదరు గ్రామస్తులు కలిసి శాలువను బహుకరించి తమ కృతజ్ఞతలు తెలిపారు. పిజిఆర్ఎస్, రెవిన్యూ సదస్సుల వల్ల గ్రామంలో మేలు జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా క్లిష్టంగా మారిన ప్రజల సమస్యకు సామరస్య పరిష్కారం చూపడంలో చొరవ చూపిన కలికిరి తహశీల్దారు మహేశ్వరి బాయ్‌ని కూడా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జెసి ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదన్ రావు, కూరపల్లి గ్రామస్తులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డిప్లొమా కోర్సు ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశకి-రాయచోటి : తిరుపతి జిల్లా వెంకటగిరిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ సంస్థలో మూడేళ్ల డిప్లొమా ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా చేనేత, జోలి శాఖ అధికారి పవన్ కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంస్థలో దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, పాండిచ్చేరి రాష్ట్రాలకు సంబంధించిన అభ్యర్థులకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు. భారతదేశంలో ఉన్న 11 హ్యాండ్లూమ్ ఇనిస్టిట్యూట్ లలో వేంకటగిరి ఇనిస్టిట్యూట్ ఒకటి,10 వ తరగతి పాస్ అయిన అభ్యర్థులకు వారి మార్కుల మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పించబడుతాయి అని తెలిపారు. ఇంట ర్మీడియట్ (ఎంపిసి) ఐటిఐ రెండేళ్లు పాసైన వారు నేరుగా రెండవ సంవత్సరంలో చేరవచ్చన్నారు. ఈ కోర్సు చెదివే వారందరూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిభంధనల మేరకు స్టైఫండ్ నెలకు రూ.2500 పొందుటకు అర్హులు ఈ కోర్సు పూర్తి చేసిన వారికి వెంటనే క్యాంపస్ సెలక్షన్ ద్వారా అందరికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. చేనేత, జౌళి శాఖకు సంబంధించిన ప్రభుత్వ ఉద్యోగాల కొరకు వీరికి అవకాశం కలదున్నారు. ఈ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదుగుటకు అవకాశాలు మెండుగా ఉన్నాయిన్నారు. ఉన్నత చదువులు చదవాలనుకున్న వారు ఈ కోర్సు చేసిన తరువాత నేరుగా రెండవ సంవత్సరం బి.టెక్ నందు ప్రవేశించవచ్చున్నారు. ఇతర వివరముల కొరకు కాలేజి వెబ్ సైట్ www.iihtv-gr.comను సందర్శించ గలరు మరింత సమాచారం కొరకు ఫోన్ నంబర్లు 9866169908, 9010243054లను సంప్రదించాలన్నారు.

బాధితులకు వెంటనే న్యాయం చేయాలి : ఎస్పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదుదారుల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎస్పి విద్యాసాగర్ నాయుడు అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదులను సేకరించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులకు వేధింపులు, భర్త, అత్తారింటి వేధింపులు, భూ ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు అధిక వడ్డీలు, ఆన్లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం ఇతర సమస్యలపై అర్జీలు స్వీకరించామని, వారి సమస్యలపై సంబంధిత పోలీస్ అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని కోరారు. బాధితు లకు చట పరిధిలో తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని సూచించారు.



బాధితుడితో మాట్లాడుతున్న ఎస్పి విద్యాసాగర్ నాయుడు

దెబ్బతిన్న అరటి పంటను చూపుతున్న రైతు

గాలివానతో రైతన్నకు తీరని నష్టం

- నేలకొరిగిన మొక్కజొన్న పంట

- రెండు ఎకరాల్లో దెబ్బతిన్న అరటి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

అకాల వర్షాలు అన్నదాతకు నష్టాన్ని కష్టాన్ని తెచ్చిపెట్టాయి. మండలంలోని పలు గ్రామాల్లో రెండు రోజులుగా కురిసిన గాలివానకు రెండు ఎకరాల్లోఅరటి తోట, మొక్కజొన్న పంటలు దెబ్బతినగా, పలు చోట్ల కోతకు వచ్చిన మామిడి కాయలు నేల రాలిపోయి రైతుకు నష్టాన్ని కలిగించాయి. మండల కేంద్రానికి చెందిన రెడ్డప రెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, రాజారెడ్డి ముగ్గురు రైతులు కలసి గ్రామానికి సమీపంలో రెండు ఎకరాల్లో అరటి సాగు చేశారు. అరటిగెలలు ప్రస్తుతం కోతదశలో ఉండగా గాలివాన దాటికి తోట నేలమట్టమైంది. సుమారు రూ.2లక్షలు వేరక నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోతున్నారు. తంబళ్లపల్లెకు చెందిన రైతు రామచంద్ర రెండెకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట గాలివాన దాటికి దెబ్బతింది. పంట చేతికందే సమయంలో క రిసిన అకాల వర్షాల కారణంగా నష్టపోయామని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో మామిడి తోటల్లో కోతకు వచ్చిన మామిడికాయలు రాలిపోయి తీవ్ర మామిడి రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి గాలివాన దాటికి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

వర్షపు నీటితో తడిచిపోయిన కుట్టు మిషన్లు

టైలరింగ్ శిక్షణ కేంద్రంలోకి వర్షపు నీరు

- శిక్షణకు అనువైన భవనాన్ని కేటాయించాలంటున్న మహిళలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ పరిధిలో 15 రోజులకు మునుపు అట్టహాసంగా ప్రారంభించిన టైలరింగ్ శిక్షణ కేంద్రం ఇటీవల కురుస్తున్న వర్షాలకు తడిసి ముద్ద యింది. శిక్షణ కేంద్రానికి అనువైన స్థలం కేటాయించడంలో అధికారులు విఫల మయ్యారని మహిళలు, స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకే శిక్షణ కేంద్రం తడిసిపోవడంతోపాటు అందులో కుట్టు మిషన్లు వర్షపునీటితో నానిపోయాయి. కొద్దిపాటి వర్షానికే శిక్షణ కేంద్రం తడిసి పోవడంతో ముమ్మర భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ఏ క్షణంలో భవ నం కూలు తుందోనని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఎంతో చేపట్టిన టైలరింగ్ శిక్షణకు అనువైన భవనాన్ని అధికారులు కేటాయించాలని మహిళలు కోరుతున్నారు.

పందెం కోళ్లు వేలం : ఎస్ఐ

ప్రజాశక్తి-కలకడ

పందెం కోళ్లను వేలం వేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మండల కేంద్రమైన కలకడ పోలీస్ స్టేషన్‌లో సోమవారం పందెంలో పట్టుబడిన కోళ్లను వేలం వేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈనెల 16న స్థానిక కొత్తపల్లి సమీపంలో ఉన్న మామిడి తోటలో కోడిపందెం ఆడుతూ తొమ్మిది మంది పందెం రాయుళ్లు 15 కోళ్లను పట్టుబడ్డాయని తెలిపారు. ఆ పందెంలో పట్టుబడిన 15 కోళ్లను వేలం వేయగా వేలం ద్వారా రూ.28,900లు వచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సొమ్మును ప్రభుత్వ నిధులకు జమ చేయడం జరుగు తుం దని చెప్పారు. వేలంపాటలో పాట దారులు, పోలీసు సిబ్బంది, పాల్గొన్నారు.

ఖరీఫ్ కార్యాచరణపై ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యయసాయ సిబ్బంది

ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై ర్యాలీ

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలంలోని చిన్నమండెం గ్రామ సంఘంలో సోమవారం గ్రామ స్థాయిలో గ్రామసభను ఏర్పాటు చేశారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ గురించి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తూ గ్రామంలోని చౌడు కుంట వీధిలో ర్యాలీ నిర్వహించారు. ఆదర్శ రైతుల విజయ గాధలను చెప్పి రైతులకు వివరించారు. పిఎండిఎస్ వేయడం వలన లాభాలు ప్రయోజనాలు గురించి తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం రెడ్డమ్మ, సిసి రెడ్డన్న, విఒఎ వీణ, విఎఎ మహర్షి, ఎంటిఎల్ చందురెడ్డి, శ్రీనివాసులు, అక్కయ్య పాల్గొన్నారు.

మల్లయ్య కొండకు సందర్శకుల తాకిడి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలలోని మల్లయ్య కొండపై ఉన్న శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి సోమవారం సందర్శకులతో కిటకిటలాడింది. ఈశ్వ రప్ప, మల్లికార్జున స్వామిని, ప్రత్యేక అలంకరణతో అలంకరించి పంచామృ తాభిషేకాలు చేశారు. కొండపైన భక్తుల పేరిట పూజలు అభిషేకాలు చేసి తీర్థ ప్రసాదాలను అందించారు. ప్రజలకు అన్నదానం చేశారు. ఆలయ ఇఒ మునిరాజు, సిబ్బంది భక్తులకు అన్ని సౌకర్యాలుకల్పించారు. ఆలయానికి దిగువన ఉన్న వెలుగు మల్లమ్మకు పూజారి శేఖర్, విజయనిర్మల ప్రత్యేక అలంకరణతో పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందించారు.

నీలం సంజీవరెడ్డికి భారతరత్న ఇవ్వాలి

-పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

మాజీ భారత రాష్ట్రపతి నీలం సంజీవ రెడ్డికి భారతరత్న ప్రదానం చేయాలని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి కోరారు. సోమవారం మాజీ రాష్ట్రపతి నీలం సంజీవ రెడ్డి 112వ జయంతిని పురస్కరించుకుని వేంపల్లెలో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీలం సంజీవ రెడ్డి గొప్ప పరిపాలనాదక్షుడు, నీతికి, నిర్భీతికి నిలువుటద్దం అన్నారు. సంజీవరెడ్డి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్ని నాలుగేళ్ల జైలు జీవితం గడిపినట్లు చెప్పారు. ఎమ్మెల్యే, ఎంపీ, రాష్ట్ర మంత్రి, ఉప ముఖ్యమంత్రి, సిఎం, కేంద్ర మంత్రి, లోక్‌సభ స్పీకర్, రాష్ట్రపతిగా అనేక పదవులు అలంకరించి గొప్ప పరిపాలనా దక్షుడుగా అనిపించుకున్నారని చెప్పారు.పిసిసి అధ్యక్షునిగా, ఎఐసిసి అధ్యక్షునిగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పులివెందుల అసెంబ్లీ నియోజక వర్గం సమన్వయకర్త ధ్రువకుమార్‌రెడ్డి, వెంకటేష్, ఉత్తన్న, పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

కత్తిరివారిపల్లెలో నూతన బోరును వేయిస్తున్న ఎఇ మిథున్ చక్రవర్తి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రత్యేక చొరవ తీసు కొని జిల్లా ప్రజా పరిషత్తు నిధులు ద్వారా ఎనిమిది తాగునీటి నూతన బోర్లను మంజూరు చేయిం చినట్లు ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ మిథున్ చక్రవర్తి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల మండలంలోని కొన్ని గ్రామాలలోని ప్రజలకు నెలకొన్న తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా దృష్టికి అధికారులు తీసు కురావడం జరిగిందన్నారు. ప్రభుత్వ అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు ఉన్న తాగునీటి సమస్యను గుర్తించి నూతన బోర్లు వేయడానికి నివేదికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించామని తెలి పారు.ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రత్యేక చొరవ తీసుకొని జిల్లా ప్రజా పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా మండలానికి రూ.20లక్షలతో 8 తాగునీటి నూతన బోర్లను మంజూరు చేయించినట్లు తెలిపారు. వెంగంవారిపల్లి గ్రామంలోని కత్తిరివారిపల్లెలో, కొండయ్య గారిపల్లి గ్రామం లోని అంబేద్కర్ కాలనీలో, రాచవేటివారిపల్లి గ్రామంలోని ఎగువ మాచిరెడ్డిగారిపల్లి, రాచవేటివారిపల్లి, ఆచార్లపల్లె, తవళం గ్రామం లోని చౌకిల్లవారిపల్లె, తవళం, ముష్టూరు గ్రామంలోని చల్లావారిపల్లెలో నూతన తాగునీటి బోర్లను వేస్తున్నట్లు తెలిపారు. నూతనంగా వేస్తున్న బోర్లతో ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించి ప్రతిరోజూ వారికి తాగు నీటిని అందిస్తామని పేర్కొన్నారు. **గాలివీడు :** గ్రామాలలో సచివాలయ సెక్రెటరీ పంచాయతీ కార్యదర్శులు నీటి సమస్య లేకుండా చూడాలని ఎంపిడిఒ సి.ఎ.జవహర్‌బాబు పేర్కొన్నారు. సోమవారం ఎంపిడిఒ కార్యాల యంలో సచివాలయ సెక్రటరీలు, పంచాయతీ కార్యదర్శులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆధార్ సీడింగ్, రేషన్‌కార్డు, జిఎ టాకింగ్, మనమిత్ర, సర్వేలపైన అప్‌టుడేట్ ఎప్పటికప్పుడు పరిష్క రిస్తూ ఉండాలని పేర్కొన్నారు. 40గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని పంపిణీ చేస్తు న్నామ ని తెలిపారు. నాలుగు గ్రామాలలో రైతు బోరు నుంచి కూడా నీరు అంది స్తు న్నామని ఇంకా ఎక్కడైనా అత్యవసర నీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుక వస్తే వెంటనే ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఆర్‌డ బ్ల్యూఎస్ జెఇ కృష్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు ఆంజనేయులు నాయక్, సరోజమ్మ, సచివాల సెక్రటరీలు కాలేబు,మురళి పాల్గొన్నారు.

గాలివీడు : సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ జవహర్‌బాబు

డంపింగ్ యార్డును తలపిస్తున్న పెద్ద చెరువు

పెద్దచెరువులో వేసిన చెత్తా చెదారం, వ్యర్థాలు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడులోని పెద్దచెరువు డంపింగ్ యార్డును తలపిస్తోంది. మండలంలోని మేజర్ పంచాయతీలైన గాలివీడు, అరవీడు, గోరాన్ చెరువు, నూలివీడు ఈ నాలుగు మేజర్ పంచాయతీలకు డంపింగ్ యార్డ్ లేక వ్యర్థ పదార్థాలను చెత్తాచెదారాన్ని పెద్దచెరువులో వేస్తున్నారు. ఆ ప్రాంత మంతా చెత్తా, చెదారం, వ్యర్థాలతో నిండి దుర్వాసన వెదజల్లడంతో ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారు. వాతావరణం కాలుష్యం కావడమే కాకుండా దోమలు విజృంభించి వ్యాధులు బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేజర్ గ్రామపం చాయతీలైన ఈ నాలుగు గ్రామ పంచాయతీలకు డంపింగ్ యార్డ్ లేకపోవడంతోనే చెత్తా చెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేస్తున్నారని అంటున్నారు. గాలివీడు, గోరాన్ చెరువు గ్రామాలు కలిసి ఉండటంతో రెండు గ్రామాల్లో అత్యధికంగా జనాభా నివిస్తున్నారు. గొరాన్ చెరువు పంచాయతీకి నాలుగు రోడ్ల కూడ లిలో నున్న ప్రధాన రహదారులు వస్తాయని, రహదారిలో ఉన్న చెత్తా చెదా రాన్ని కూడా సమీపంలో ఉన్న గాలివీడు పెద్ద చెరువులో వేస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డంపింగ్ యార్డ్ కు స్థలాన్ని ఏర్పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

ఆర్‌టిసి బస్టాండ్‌లో గ్రీన్ నెట్స్ ఏర్పాటు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రంలోని ఆర్‌టిసి బస్టాండ్‌లో ప్రయాణికులకు సౌకర్యవ ంతంగా పంచాయతీ సిబ్బంది గ్రీన్ నెట్స్ ఏర్పాటు చేయడం సంతోషకరమని పీలేరు డిపో మేనేజర్ నిర్మల తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఎండ తీవ్రతను ప్రయాణికులు తట్టుకునే విధంగా ఈ గ్రీన్ నెట్స్ దోహదపడ తాయని అన్నారు. స్థానిక పంచాయతీ వారు ఆధ్వర్యంలో బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికులు వడదెబ్బకు గురికాకుండా గ్రీన్ నెట్స్‌ను ఏర్పాటు చేయిం చామని పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర తెలిపారు. పంచా యతీ వారు చేసిన ఈ మంచి కార్యక్రమాన్ని చూసి డిఎం ఎంతో కృతజ్ఞతలు తెలిపినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉండడం గుర్తించిన పంచాయతీ వారు ఇలాంటి మంచి పనులు చేయడం అభినందనీ యమ న్నారు. గతంలో కూడా ప్రయాణి కుల దాహార్తిని తీర్చేందుకు బస్టాండ్ ఆవరణంలో చలివేంద్రం కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. గ్రీన్ నెట్స్, చలి వేంద్రం ఏర్పాటుకు సహకరించిన ఎంపిడిఒ అబ్దుల్ రహీంకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన గ్రీన్‌నెట్స్

భోజన వసతుల కోసం స్థల పరిశీలన

గువ్వల చెరువులో భోజన వసతి స్థలాన్ని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-రామాపురం

ఈనెల 27, 28, 29 తేదీలలో కడపలో జరిగే తెలుగుదేశం పార్టీ మహా నాడుకు హాజరయ్యే నాయకులు, కార్యకర్తలకు మార్గమధ్యంలో భోజన వసతులు ఏర్పా టు చేయడానికి స్థలాన్ని రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కుమారుడు నిశ్చల్‌నాగిరెడ్డి మండలంలోని గువ్వలచెరువు పరిసర ప్రాంతాలలో సోమవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మహానాడుకు అన్న మయ్య, చిత్తూరు జిల్లాల నుంచి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలోని టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీగా తరలి వస్తారని అన్నారు. వారికి భోజన వసతులు, వాహనాల పార్కింగ్ కోసం గువ్వల చెరువు పరిసరాల్లో స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. రెండు జిల్లాల నుంచి లక్షలాది మంది నాయకులు, కార్యకర్తలు తరలి వస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొండ్రాయుడి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-రాయచోటి

స్వర్గీయ దివంగత సుగవాసి పాలకొండ్రాయుడు గతంలో రాయచోటి నియోజకవర్గానికి చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం దివంగత స్వర్గీయ పాలకొండ్రాయుడు దశదినకర్మ కార్యక్రమాన్ని తన కుమారులు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం, టిటిడి మాజీ పాలకమండలి సభ్యులు మండలి సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. టిడిపి యువ నాయకులు నిచ్చల్ నాగిరెడ్డి పాల్గొన్నారు. సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్వర్గీయ,దివంగత మాజీ ఎమ్మెల్యే,ఎంపీ సుగవాసి పాల కొండ్రా యుడు రాయచోటి నియోజకవర్గంకి చేసిన సేవలు మరువలేని అన్నారు. ఈ సందర్భంగా టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు, కడప టిడిపి జిల్లా అధ్యక్షులు ఆర్. శ్రీనివాసరెడ్డి, పీలేరు ఎమ్మెల్యే కిషోర్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ సి.రామచం ద్రయ్య, మాజీ ఎమ్మెల్యేలు ద్వారకనాథరెడ్డి, మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గాజుల భాస్కర్, జిల్లాలోని పలువురు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాలకొం డ్రాయుడు రాయుడు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళుల ర్పించారు.

పాలకొండ్రాయుడు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న శ్రీనివాసరెడ్డి, నాయకులు

సిద్ధేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టాపన

- హాజరైన టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు

జగన్‌మోహన్‌రాజును సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండలంలోని శేషన్నగారిపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ పోతుకొండ సిద్దేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టాపనను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తుల ఆహ్వానం మేరకు టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి అనుగ్రహం గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలకు ఆయు రారోగ్యాలు ఆకాంక్షించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. రోడ్లు, డ్రైయి నేజీ, తాగునీటి సమస్యలు లేకుండా చూస్తామని చెప్పారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యతను ఇస్తామని చెప్పారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి తలెత్తకుండా తాగునీటి బోర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అనంతరం గ్రామస్తులు ఆయనకు పుష్పగుచ్చం అందజేసి సత్కరిం చారు.కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, కమిటీ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పద్మనాభయను సన్మానిస్తున్న ప్రముఖులు

రచయితకు ఘన సన్మానం

ప్రజాశక్తి-పుల్లపేట

ప్రముఖ రచయిత శ్రీరామదాసు పద్మనాభయను బహుత్తమ విద్యా దాన సభ సంస్థల అధినేత అధ్యాపక బృందం ప్రముఖులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అవతార మహిమ కాలజ్ఞానం అనే పుస్తకాన్ని కవి శ్రీ పద్మనాభయ్య అద్భుతంగా రచిం చారని వారు కొనియాడారు. చాలా గ్రంథాలను ఆయన రచించారని ఆయన రచనలు సులభ శైలిలో అందరికీ సామాన్యులకు సైతం అర్థమయ్యే విధంగా గొప్పగా రచిస్తారని ప్రశంసించారు. ఆయనను ఘనంగా సన్మానించి అనంతరం పుస్తకా విష్కరణ చేశారు. ఈకార్యక్రమంలో రచయితలు, కవులు, భాషా ప్రేమికులు పాల్గొన్నారు.

ఉత్తమ ర్యాంకులను సాధించడం జిల్లాకు గర్వకారణం

-కలెక్టర్ శ్రీధర్ చామకూరి

ప్రజాశక్తి-రాయచోటి

వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టళ్లలో ఉండి చదువుకొని ఉత్తమ ర్యాంకులను సాధించడం జిల్లాకు గర్వకారణమని, ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు భావితరాలకు మార్గదర్శకులని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని తన చాంబర్లో జిల్లాలో వివిధ బిసి హాస్టళ్లలో ఉండి పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదువుకొని ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, నగదు బహుమతిని అందిం చారు. పీలేరు బిసి హాస్టళ్లలో ఉండి ఇంటర్మీడియట్ చదువుకుని రాష్ట్ర వ్యాప్తంగా రెండో ర్యాంకు, జిల్లా వ్యాప్తంగా మొదటి ర్యాంకు సాధించిన సి. చిలకమ్మ, వాయల్పాడులోని బిసిహాస్టల్ లో పదవ తరగతి చదువుకుని రాష్ట్రవ్యాప్తంగా ఏడో ర్యాంకు, జిల్లా వ్యాప్తంగా మొదటి ర్యాంకు సాధించిన పునీత, దేవలంపల్లి డిఎన్‌టి బాయ్స్ హాస్టల్లో చదువుకుని రాష్ట్రవ్యాప్తంగా ఏడో ర్యాంకు, జిల్లా వ్యాప్తంగా మొదటి ర్యాంకు సాధించిన కిషోర్‌బాబుకు అభినందించారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సురేష్ కుమార్, ఆ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి- లింగాల : ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఈశ్వరయ్య పేర్కొన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం ఆయన మాట్లాడుతూ భూ, రేషన్, ఇతర సమస్యలపై ప్రజల నుంచి వినతులు వచ్చాయని చెప్పారు. వాటిని స్వీకరించి అక్కడికక్కడే పరిష్కరించామన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఎంఇఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గం ఎంఇఎఫ్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె. రవీంద్ర, గౌరవ అధ్యక్షులుగా రామకృష్ణ, గౌరవ సలహాదారులుగా గంగన్న, శ్రీనివాసులు, జి ప్రసాద్ హరిప్రసాదు, ఉపాధ్యక్షులుగా కత్తి శ్రీనివాసులు రామాంజనేయులు, అడవి రాముడు ఎన్నిక య్యారు. ప్రధాన కార్యదర్శిగా చిరంజీవి, సహాయ కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం, వీరుడు, కోశాధికారిగా రాం ప్రసాద్, కార్యనిర్వహణ కార్యదర్శిగా రవీంద్ర రవిశంకర్, కార్య నిర్వాహ సభ్యులుగా రామాం జనేయులు, బాల వీర నారప్ప, గంగ రాజు, గంగా ధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

క్రైం కార్నర్

నిందితుల వివరాల వెల్లడిస్తున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు

- వివరాలు వెల్లడించిన ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్/రామసముద్రం

మదనపల్లి రూరల్ పరిధిలో ఈ నెల 11న కాళ్ళు, చేతులు కట్టేసి కాలిన గాయలతో ఉన్న మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించి ముగ్గురు నిందితులను ఆరెస్టు చేశారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు ఈ కేసు వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మదనపల్లి రూరల్ పరిధి లోని రామసముద్రం పోలీసుస్టేషన్‌లో ఈనెల 11న చెంబుకూరు ఎలకపల్లి రహదారిలో కాళ్ళు, చేతులు కట్టి మహిళ కాలిన గాయాలతో మృతి చెంది ఉందని విఆర్ఒ అనూష పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు సంఘ టన స్థలాన్ని పరిశీలించి 12న కేసు నమోదు చేశారని అన్నారు. మృతురాలి శరీరం కుడి చేతి మీద ఉన్న పచ్చ బొట్టు యస్మిత అన్న పేరును గుర్తించి దాని ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేశారని తెలిపారు. మృతురాలు మందనపల్లి మండలం, వేంపల్లి పంచాయతీ, జంగాలపల్లికి చెందిన బూసిపల్లి శివమ్మ(27)గా గుర్తించినట్లు తెలిపారు. మృతురాలు మదనపల్లిలోని ఈశ్వరమ్మ కాలనీకి చెందిన సంతోష్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకొని అతనితో వెళ్లిపోయిందని తెలిపారు. దీనిపై కక్ష పెంచుకున్న మృతురాలి భర్త వెంకట రమణ సోదరి యం.నీలావతి, తన అక్క కొడుకు గణేష్, ప్రియుడు గోపా ల్‌లో కలిసి హత్యకు పాల్పడినట్లు తెలిపారు. శివమ్మ కాళ్లు, చేతులను తాళ్లతో కట్టి అదే తాడును గొంతుకు బిగించి హత్య చేశారని అన్నారు. ఎలాంటి ఆధారాలు లభించకూడదనే ఉద్దేశంతో పెట్రోల్ పోసి నిప్పు పెట్టారని తెలిపారు. మదనపల్లి డిఎస్‌పి ఎస్.మహేంద్ర, మదనపల్లి రూరల్ సిఐ సత్యనారాయణ, ఎస్ఐ రవి కుమార్, సిబ్బంది ఎంతో చాకచక్యంగా రామసముద్రం తహశీల్దార్ కార్యాలయం వద్ద ముగ్గురు నిందితులను అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రెండు లీటర్ల పెట్రోల్ బాటిల్, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎలాంటి ఆధారాలు, ఆన వాళ్లు లేకుండా వివాహిత మహిళను హత్య చేసిన దుండగులను అతి చాకచక్యంగా టెక్నికల్ టీం, డాగ్‌స్క్వాడ్ సహకారంతో అతి తక్కువ సమయంలో కేసును ఛేధించి నట్లు తెలిపారు. కేసు ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని సానిపాయ-రాజంపేట రోడ్డు మార్గంలో కృష్ణారెడ్డి చెరువు సమీపంలోని టెంపో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో మహమ్మద్(27) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని రాయవరం గ్రామం కస్పాకు చెందిన మహమ్మద్ రాజంపేటలో ఇంజినీర్‌గా విదులు నిర్వహి స్తున్నాడని తెలిపారు. రాజంపేట నుంచి రాయ వరంకు తిరుగు ప్రయాణంలో వస్తుండగా సుండుపల్లె నుంచి ఎదురుగా వస్తు న్న లగేజ్‌తో టెంపో వాహనం ఢీకొన డంతో మృతి చెందినట్లు తెలిపారు. పోలీ సులకు సమాచారం అందడంతో సంఘటన స్థలా నికి చేరుకొని మృత దేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలి పారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.